


## కాగితపు చుట్టలో ఖురాన్!

చేతితో తయారుచేసిన పొడవైన కాగితంపై సూక్ష్మమైన అక్షరాలతో ఈ ఖురాన్‌ను లిఖించారు. నస్క లిపిలో ఎత్తి రాసిన ఈ ఖురాన్ 300 ఏళ్ల నాటిది! తిలకం సీసా పరిమాణంలో ఉండే చిన్న డబ్బాలో ఈ కాగితపు చుట్ట ఇమిడిపోతుంది.

**తిలకం సీసా పరిమాణంలో ఉన్న బాక్స్‌లో పట్టేంత కాగితం చుట్టపై రాసిన ఖురాన్**

తాపరుద్ర చరిత', పంచతంత్ర కథలు మొదలైన వెన్నో ఉన్నాయి. ఇవేకాకుండా ఆయుర్వేద గ్రంథాలు, వైద్య చికిత్సా పద్ధతులు, వ్యవసాయం, వృత్తులు మొదలైన తెలుగు గ్రంథాలెన్నిటినో పరిశోధకుల అధ్యయనం కోసం పరిరక్షిస్తున్నారు. ఆయుర్వేద విభాగంలో ఉన్న కూరగాయల గుణములు, జ్వర విధానము, సుఖరోగ చికిత్సా సంగ్రహం లాంటి ప్రతులు పరిశీలిస్తే.. వాటిలోని విషయాలు నేటి ఆధునిక చికిత్సా పద్ధతులకు ఏమాత్రం తీసిపోవు. గణితశాస్త్రం, తత్వశాస్త్రం, పురాణాలు, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన రెండు వేలకుపైగా తెలుగు గ్రంథాలు ఉన్నాయిక్కడ.

### సేకరణ - పరిష్కరణ - ప్రచురణ

ప్రాచీన రాతప్రతులను సేకరించడం, వాటిని సంరక్షించడం, పరిశోధకులకు వాటిని అందుబాటులో ఉంచడం ప్రాచ్య లిఖిత గ్రంథాలయం – పరిశోధనా సంస్థ లక్ష్యాలు. ప్రాచీన రాతప్రతులు ఎక్కడెక్కడ ఉన్నాయో ఈ సంస్థ సర్వే చేస్తుంది. ఆ రచన, రచయిత, కాలాన్ని గుర్తించి నమోదు చేస్తుంది. తాళపత్ర గ్రంథాలు కలిగిన వారిని ఒప్పించి సేకరిస్తుంది. ఇక్కడ ఆ తాళపత్రాలను కీటకాల బారినుంచి కాపాడేందుకు రసాయనాలతో శుద్ధి చేస్తారు. వాటి జీవిత కాలం పెంచేందుకు ఏడాదికోసారి లెమన్ గ్రాస్, సిట్రానిల్లా ద్రావణాలను తగుపాళ్లలో కలిపి పైపూతగా పూస్తారు. ఇవి ఏడాదిపాటు కీటకాల బారిన పడకుండా కాపాడతాయి. ప్రాచీన గ్రంథాల విషయ సూచికను రూపొందించి పరిశోధకులకు అందుబాటులో ఉంచుతారు. పండితులు, పరిశోధకుల సహకారంతో ప్రతిలేఖనం చేయించడం, పరిష్కరించడం, ప్రచురించడం కూడా ఈ సంస్థ విధి.



కాగితపు చుట్టపై భగవద్గీత

### విదేశీ పరిశోధకులకు విజ్ఞాన ఖని

మనిషి ఎంత దూరం వలసపోయాడో అంతదూరం తన వారసత్వాన్ని తీసుకుపోయాడు. ఒక ప్రాంతంలో లిఖితమైన గ్రంథాలు మరో ప్రాంతానికి పరిచయమై జ్ఞాన వ్యాప్తి జరిగింది. ఆ ప్రాచీన వైజ్ఞానిక చరిత్రకు ఆనవాళ్లే కాదు ఆధారాలుగా ఈ ప్రాచ్య లిఖిత గ్రంథాలు దోహదపడతాయి. పశ్చిమ దేశాలతో భారతదేశానికి ఉన్న చారిత్రక అనుబంధాన్ని చెప్పే కథలు, గాథలు, చరిత్ర, మత విశ్వాసాలు, తత్వం, న్యాయం, రాజనీతితోపాటు జానపద గాథలెన్నో చెప్పే గ్రంథాలెన్నో నిండిపోయిన జ్ఞానభాండం ఇది. అందుకే దేశ విదేశాల నుంచి వచ్చే పరిశోధకులకు ఈ రాతప్రతులను అందుబాటులో ఉంచుతున్నారు. ఇక్కడి దాకా రాలేని పరిశోధకులకు ప్రాచీన గ్రంథాలను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నారు. ఇరాన్, ఇరాక్, అమెరికా నుంచి ఎక్కువ మంది పరిశోధకులు ఈ రాతప్రతులను అధ్యయనం చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. విదేశీ పరిశోధకుల కోసం పరిశోధనాలయంలో డిజిటలైజేషన్ కార్యక్రమం చేపట్టి వందలాది గ్రంథాలను డిజిటల్ రూపంలోకి తీసుకువచ్చారు. తాళపత్ర గ్రంథాల గురించి విద్యాసంస్థల్లో అవగాహన కల్పించడం, మౌఖిక సాహిత్యాన్ని కూడా ప్రచురించడం ఇటీవల కాలంలో ఈ సంస్థ చేపట్టిన నూతన కార్యక్రమాలని రీసెర్చ్ స్కాలర్ మెట్టు వెంకటనారాయణ చెప్పారు. సిల్మా నాయక్ రచించిన 'నల్లగొండ జిల్లా బంజారా మౌఖిక కథలు', రాజారాం రచించిన 'బంజారా నోటి కథలు' ప్రాచ్య లిఖిత గ్రంథాలయం ప్రచురించినవే.

### దశాబ్దకాల స్వర్ణయుగం..

ప్రాచ్య గ్రంథాలయ – పరిశోధనా సంస్థకు వడ్లమూడి గోపాలకృష్ణ మొదటి సంచాలకులుగా నియమితులైనారు. ఆచార్య జయధీర్ తిరుమలరావు, ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యం సంచాలకులుగా ఉన్న కాలాన్ని ఈ సంస్థకు స్వర్ణయుగంగా పేర్కొంటారు. ఆచార్య జయధీర్ తిరుమలరావు 2005 ప్రాచ్య లిఖిత గ్రంథాలయం, పరిశోధన సంస్థకు సంచాలకులుగా నియమితులయ్యారు. ఆయన సారథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం రాతప్రతులను గుర్తించి, సేకరించేందుకు సర్వే నిర్వహించారు. మండలం ఒక యూనిట్‌గా తీసుకుని ఒక సర్వేయర్‌ని, జిల్లాకు ఒక కో ఆర్డినేటర్‌ని నియమించి అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహించారు. అయిదేళ్లలో ఈ సర్వే పూర్తయింది. 2010లో సంస్థకు సంచాలకులుగా ఉన్న ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యం నేతృత్వంలో జాతీయ పాండు లిపి సంస్థ (నేషనల్ మాన్యుస్క్రిప్ట్ మిషన్)తో కలిసి రాతప్రతుల పరిరక్షణ కోసం అనేక కార్యశాలలు నిర్వహించారు. ఈ పదేళ్ల కాలంలో 70 పుస్తకాలను ప్రచురించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఆయుష్ శాఖ అనుబంధ సంస్థ)తో యునానీ రాతప్రతులను ప్రచురించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఉర్దూ, అరబిక్, పారశీకలో ఉన్న 500కుపైగా యునానీ వైద్య రాత ప్రతులను డిజిటల్ రూపంలో అందించారు. అవన్నీ పుస్తక రూపంలో అందుబాటులోకి రానున్నాయి. రాతప్రతులు రక్షించుకుందాం. ఘనమైన వారసత్వాన్ని చాటుకుందాం.■

## నేటి తరం మేల్కొనాలి



మన రాతప్రతులపట్ల మనకంటే విదేశీయులే ఎక్కువ అభిమానం చూపారు. మన భాషలు నేర్చుకుని వాటి సారాన్ని తెలుసుకున్నారు. ప్రాచీన భారతీయులు సముపార్జించిన జ్ఞానంతో కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారు. మనం వీటిని కాపాడుకోవడమే కాదు కొత్త ఆవిష్కరణలు చేయాల్సిన అవసరం ఉంది. ఆ చైతన్యం కోసమే విద్యాలయాలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. అన్ని విజ్ఞాన శాస్త్రాలు ప్రాచీన రాతప్రతుల్లో ఉన్నాయి. ఆ విశేషాలను నేటి తరానికి చేరవేసేందుకు ప్రయత్నిస్తున్నాం. స్వర్ణోత్సవాల సందర్భంగా ఐటీ శాఖ సహకారంతో మాన్యుస్క్రిప్ట్ వెబ్‌సైట్ రూపొందిస్తున్నాం. సంస్థ సేకరించిన రాతప్రతులన్నీ డిజిటల్ రూపంలో ప్రపంచానికి అందుబాటులో ఉంచుతాం.

**- డాక్టర్ పాలెపు సుబ్బా రావు,**
సంచాలకులు
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం – పరిశోధనా సంస్థ